# నన్ను పెళ్ళిచేసుకోరా?

జి. ఎస్. సూరి

వీధి గోడకు ఉన్న 'టు లెట్' బోర్డ్ తీసుకొచ్చి ఇంట్లో పెట్టింది జానకి. ఆ రోజుతో దాని అవసరం తీరి పోయింది.

జానకి వాళ్ళ మేడమీద గదిలోకి ఆ వేళ రామారావు అనే అతను అద్దె కొస్తున్నాడు. అంతక్రితం రోజునే వచ్చి అద్దె అదీ మాట్లాడుకుని అడ్వాన్స్ ఇచ్చి, మర్నాడు ప్రవేశిస్తానని చెప్పి వెళ్ళాడు.

జానకి హాల్లో పచార్లు చేస్తోంది. ఆమె మనసు నిలకడగా ఉండటంలేదు. అదేమేమో ఆలోచిస్తోంది.

రామారావు బాంక్‌లో పనిచేస్తున్నాట్ట. మంచివాడులానే కనబడుతున్నాడు. మర్యాదా, మన్ననా తెలుసును మనిషికి. ఇలా అని జానకి తండ్రి తల్లితో అంటూంటే వింది.

'మనిషెలా ఉంటాడో?' ఆరాట పడింది జానకి మనసు.

అంతక్రితం రోజు అతను గదికోసం వచ్చినప్పుడు అతన్ని చూడటమే పడలేదు. తనేమో లోపలి గదిలో ఉండిపోయింది. బయటేమో అమ్మా, నాన్నా ఉండిపోయారు. మాటమాత్రం వింది. గంభీరమైన కంఠం. పరిపూర్ణమైన పురుషత్వం ధ్వనించిందా కంఠంలో.

జానకక్కేం తోచటం లేదు. కాలు గాలిన పిల్లిలా లోపల్నుంచి బయటకూ, బయట్నించి లోపలకూ తిరుగుతూంది. మరి కాస్సేపటికి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా తన గదిలోకి వెళ్ళి అద్దంముందు కూర్చుంది.

అద్దంలో తన ప్రతిబింబం తనకే వికారం కలిగించింది జానకికి.

నల్లటి నలుపు జానకిది. కనుముక్కు తీరైనా ఆకర్షణీయంగాఉండదు. దానికితోడు పోషణలేని ఆమె అడతనం జానకిని మరింత అందవికారంగా ఉండేలా చేసింది.

ఇంక ఎక్కువసేపు అద్దం ముందు కూర్చోలేక లేచిపోయింది జానకి.

'హుఁ ... తను పుట్టటం ఎంత పాపమైపోయింది. లేదు ... లేదు. ఎంత పాపం చేసుకుని తను పుట్టింది— అందవికారంగా, అసహ్యంగా! కన్న వాళ్ళు కూడా సహించలేనంత కురూపిగా. పైగా తన కీ కన్నే చెర ఒకటి.' జానకి కళ్ళు చెమ్మగిల్లాయి.

జానకి ఆలోచిస్తోంది.

'చెర! నిజంగా తనాక బందీగానే ఉంది. కొన్నేళ్ళవరకూ, కొన్నాళ్ళ వరకూ తను స్వేచ్ఛగానే తిరిగేది. దాను దాను వయసు రాకాసిలా మీద పడుతున్న కొద్దీ తను బందీగా మారిపోయింది. తనను చూసిన ప్రతి వాళ్ళూ "నల్ల పిల్ల" అనో, "మాలకా"కనో వెక్కిరించి వేళాకోళం చేస్తూంటే విని విని విసుగెత్తి, తన కా చీకటి గదిని చెరగా చేశారు. అమ్మా, నాన్నా! వాళ్ళ బాధ వాళ్ళదీ.'

అశాంతిగానూ, అల్లకల్లోలంగానూ ఉంది జానకి మనసు.

రామారావు జ్ఞాపకం వచ్చాడు జానక్కి.

'అత నొస్తే బాగుండును. ఒకమాటు చూసి మళ్ళీ తన గదిలోకి...ఆ చీకట్లోకి వెళ్ళిపోవచ్చు. మళ్ళీ నాన్న బజారు నుంచి వచ్చేస్తే వీలుండదు ... అమ్మ కూడా పనిలో ఉంది.' జానకి మనసు తొందరపడింది.

గడియారం వైపు చూసింది.

పదైంది.

'తొమ్మిదింటికే వస్తానన్నాడు!' మనసులోనే అనుకుంది.

'వచ్చేస్తాడు ... వచ్చేటైమైంది... నాన్న మలో అరగంట వరకూ రాకుండా ఉంటే బాగుండును. అమ్మ కూడా ఇప్పుడిప్పుడే పిలవకుండా ఉంటే బాగుండును.' వేయి దేవుళ్ళకు మొక్కింది

"ఓసేవ్ జానకీ... దేభ్యం మొహం! ఒకమాటిలా తగలడు." వంటింట్లోంచి తల్లి గావుకేక పెట్టింది.

భగవంతుడు తన మొక్కుబడి తీర్చలేదు.

తీర్చడు! తనకు తెలుసు.

జానకి వాపోయింది.

అమ్మ పిలిచే మొదటి పిలుపే తనకి వినపడుతుంది. అయినా, ఆ దేభ్యం అనే పేరుకూడా చేరిస్తే కాని తన పిలుపుకి నిండుతనం ఉండదనుకుంటుంది కాబోలు అమ్మ.

నీరసంగా లేచి వంటింట్లోకి నడిచింది జానకి.

తొందరగానే అయింది పని. తను సావిట్లోకి వెళ్ళేవరకూ అతను రాకపోతే బాగుండును. గబగబా నడిచింది సావిట్లోకి. జానకి సావిట్లోకి వచ్చేసరికి వీధి తలుపు చప్పుడైంది.

'నాన్న వచ్చేశాడు! ... అతగా డొస్తూ డొచ్చినా ఇంక ఒకటే!' జానకి నిరుత్సాహంగా అనుకుంటూ వెళ్ళి వీధి తలుపు తీసింది.

"ఏం సావిట్లో తచ్చాడుతున్నావ్?" సావిట్లోకి వస్తూనే తీక్ష్ణంగా అడిగాడు తండ్రి జానకిని.

జానకి భయంతో చిన్నగా వణికింది.

"ఉహుఁ ... తలుపు తీద్దామని—" మెల్లగా జవాబిచ్చింది.

"తీయటం అయిందిగా ... వెళ్ళింక అంతఃపురంలోకి." చీదరంగా అన్నాడు.

జానకి తల వంచుకుని వచ్చేసింది. తన గదిలోకి వెళ్ళి మనసారా ఏడ్వటం మొదలు పెట్టింది.

గదిలో చీకటి. చీకటిలో జానకి.

ఏడుపు మాని మెల్లగా తల ఎత్తింది జానకి. ఆమె ఓ మాటు వెర్రిగా నవ్వుకుంది.

'తనెవరితో కలవలేకపోయినా, ఈ చీకటితో బాగా కలిసిపోగలిగింది.'

రామారావు జ్ఞాపకం వచ్చాడు జానక్కి.

'ఈ పాటికి గదిలోకి వచ్చి ఉంటాడు. అంతా సర్దుకుంటున్నాడేమో... ఏమో? తనెంత దురదృష్టవంతురాలు! తన పరిస్థితి ఎంత దీనమైనది! కాకపోతే... పాటి మనిషిని తన దాపులకు వచ్చిన మనిషిని చూడలేకపోవటమా? లేదు. తనింకెప్పుడూ అతన్ని చూడలేదు. చూడటానికి అవకాశం రాదు. ఎందుకంటే— పదింటివరకూ ప్రతి రోజూ తండ్రి సావిట్లోనే ఉంటాడు. పది తరవాత తనకి సావిట్లోకి వెళ్ళే అవకాశం కలిగినా, అత నప్పటికి బాంక్‌కు వెళ్ళిపోయి ఉంటాడు. పోనీ, అతను తిరిగొచ్చే వేళకైనా కుదురుతుందా అంటే ... ఉహుఁ! మళ్ళీ సాయంకాలం అయిదింటి నుంచి సావిట్లో తండ్రి కాపలా మొదలవుతుంది. ఇంకెప్పుడు? లేదు... లేదు. తన కా అవకాశమే లేదు.'


జానక్కి తన బ్రతుకంటే తనకే అసహ్యం కలిగింది.

'అయినా, నల్లగా ఉన్నంతమాత్రాన నాన్న తన నెందుకు చీదరించుకుంటున్నాడు? ఎందుకు వీళ్ళు న న్నిలా చీకటి కొట్లో బంధిస్తున్నారు? ... నల్లగా ఉండటం అనేది తన అపరాధం కాదే!' జానకిలో ప్రశ్నాపరంపరలు.

అంతలోనే ఏదో జవాబు స్ఫురించటం. 'తను ఎదుటపడితే ఈ నల్లపిల్లకు పెళ్ళిచేయగలుగుతానా? అన్నప్రశ్న బహుశా నాన్నని భయపెడుతుందేమో! అంతే అయ్యుంటుంది. అందుకే తన కీ చీకటికొట్టు బందిఖానా. అందుకే తనకీ చెర! ... కన్నెచెర!... భగవాన్! న న్నీ కన్నె చెర నుంచి విముక్తురాల్ని చెయ్యి. నా బ్రతుక్కి కూడా ఒక అర్థం కల్పించు. అన్ని పూలూ మాలగానే నీ కంఠాన్ని అలంకరించవు. కొన్ని నీ పాదాల మీద కూడా పడుంటాయి. అలాగే నాక్కూడా ఏ మగాడి చరణాల దగ్గరైనా దాసిగా పడుండే భాగ్యం అనుగ్రహించు. అవును, భగవాన్! అవును... కనీసం నా మెడ కొక పసుపుతాడు ప్రసాదించు.'

జానకి కళ్ళు వర్షిస్తున్నాయి.

జానకికి ఏవేవో జ్ఞాపకాలు వస్తున్నాయి. "ఖర్మ!" నుదుటని అరచేత్తో కొట్టుకుంది. జానకి చాలా చిన్నప్పుడు—అప్పటి కింకా ఆమెకి "నల్లపిల్లా!"



ఆశాలత

చిత్రం—ఎస్. విజయకుమార్ (కరీంనగర్)

అనేపేరు స్థిరపడలేదు—ఒకమాటు ఎవరో బంధువు లావిడ వాళ్ళబ్బాయిని చూపించి, "ఏమే, జానకీ! మా నానిగాణ్ణి పెళ్ళిచేసుకుంటావా?" అనడిగింది, వేళాకోళంగానే! అందుకు జానకి వెంటనే "ఛీ! పెళ్ళెవరు చేసుకుంటారూ? . . . పాడు పెళ్ళి! నే నసలు పెళ్ళే చేసుకోను. నా కసలు పెళ్ళే అక్కర్లేదు" అంది సాగదీసుకుంటూ.

అది జ్ఞాపకం వచ్చింది. 'ఎందుకు చేసుకోనూ? ... చేసుకుంటాను! నాకు పెళ్ళి కావాలి ... నాకు పెళ్ళిచేసుకోవాల నుంది... అయితే, ఏం లాభం? తెలిసో తెలియకో ... అజ్ఞానమో అమాయకత్వమో పెళ్ళొద్దనుకుంది. . . అలాగే జరిగింది ... ఆ మాటలకు ఏ దేవతలో తథాస్తు అనేశారులా ఉంది ... అందుకే తన కసలు పెళ్ళికావటం లేదు. కావాలనుకున్నా కావటం లేదు!' బాధగా అనుకుంది జానకి.

'ఎంత తప్పు చేశాను! ఎంత తప్పు చేశాను!' చెంపలు ఛెళ్ళు ఛెళ్ళున చరుచుకుంది జానకి.

'తల్లితండ్రులు పిల్లల్ని ఏ తప్పు చేసినా క్షమించగలరేమో కాని, పెళ్ళికాని ఆడపిల్లను మాత్రం క్షమించలేరు. అదామె తప్పు కాకపోయినా సరే— అదో పెద్ద నేరంగా ఎంచి సహించలేరు; భరించలేరు. అందుకనేనేమో ఆడపిల్ల ఎదిగితే చాలు, గుండెల మీద కుంప టెక్కిస్తున్నట్లు బాధపడతారు.'

జానకి ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

రామారావు మనసులో మెదిలాడు.

రూపం తెలియని రామారావు అస్పష్టంగా!

'రామారావు ఎలా ఉంటాడో! ... అజానుబాహు అరవింద దళాయతాక్షుడిలా ఉంటాడా? అయితే, అతను శ్రీరామచంద్రుడిలా ఉంటాడన్న మాట! అదే అయితే రామారావు సకల గుణాభిరాముడై ఉండాలి... తను జానకైతే? అవటానికి తను జానకే?... వట్టి పేరుకు మాత్రమే ... అంతా తన ఆశ! అత్యాశ!!' జానకి నవ్వుకుంది.

ఎంతలా అనుకున్నా రామారావు పేరూ, తన పేరూ పక్కపక్కల కనబడుతున్నాయి జానకి ఊహాపథంలో.

జానకిలోని ఆశల ఆలోచనలు మరిన్ని చిగుళ్ళు వేయసాగాయి.

'ఏమో? ... ఏ పుట్టలో ఏ పాముందో ... ఇతగాడే తన నుద్ధరించటానికి వచ్చిన దేవుడేమో? ... ఇతనైనా తనని కన్నెచెరనుంచి విముక్తురాల్ని చేస్తే? ...'

జానకి మనసు తెగింపుకి సిద్ధపడుతూంది.

' పోనీ ... పోనీ ఒకమాటు అడిగి చూస్తే ... తనని చూసి మోహించేతా, ప్రేమచేతా కాకపోవచ్చు ... కేవలం జాలిచేతో, సానుభూతిచేతో తనని ...

కన్నెచెర నుంచి విముక్తికోసం జానకి మనస్సు సిగ్గులేకుండా ఆలోచిస్తూంది. పూర్తిగా సిగ్గు వదిలేసి ఆరాట పడుతూంది.

'ఎంత భయంకరమైన జీవితం తనది! ... ఎంత దయనీయమైనదీ తన స్థితి! ... కాకపోతే లోకంలో ఏ ఆడపిల్లైనా తనలా ఆలోచిస్తుందా? తను నలుపుగా ఉండటం తన కురూపితనం—ఇవేకాదు తనకి శాపం! తనవాళ్ళ బీదతనం కూడానూ. తనవాళ్ళే కనక గొప్పవాళ్ళయితేనా? ... తనే కనక గొప్పింటి పిల్లయితేనా? కాసులు గుమ్మరించి తాళి కట్టించుకునేది ... పెళ్ళి చేసుకునేది. కన్నెచెర బంధాలు తెంచుకునేది. కాని, తన కా అదృష్టం లేదే! తను అన్నివిధాలా బీదదైపోయింది. అందానికీ, ఐశ్వర్యానికీ, కన్నవాళ్ళ ఆదరణకూ... అందుకే తన దీ చీకటి బ్రతుకైంది?'

జానకి హృదయం విలవిలలాడిపోతూంది.

జానకి కత్తికోత ననుభవిస్తూంది. ఎడతెరిపిలేని ఆలోచనలలో కొట్టుకుపోతూనే ఉంది.

'కాని, రామారావు డబ్బు మనిషి కాడేమో! ... మంచివాడన్న సర్టిఫికెట్ నాన్న ఎలాగైనా ఇచ్చేశాడు ... ఇంక దేనికి సంశయించాలి? కాదంటాడేమోననా? . . . అలా అంటాడా? . . . అనకూడదని ఎక్కడా లేదుగా! ...'

ప్రశ్నలూ—సమాధానాలూ, ప్రశ్నల వెంట సమాధానాలూ, సమాధానాలు లేని ప్రశ్నలూ... ఒకదానివెంట ఒకటీ, ఒకదాన్ని తరుముతూ ఒకటీ జానకి బుర్రను హింసపెట్టేస్తున్నాయి. ఆలోచనల నరక యాతన అనుభవిస్తూంది జానకి.

ఆలోచించి ఆలోచించి ఆమెలో ఓపిక నన్నగిల్లిపోయింది. ఆమె నీరసించిపోయింది.

'అయినా, ఎప్పుడైనా అవకాశం వస్తేగా? ... అదొచ్చినప్పుడూ, అంతటి అదృష్టం పట్టినప్పుడూ చూడచ్చు ... పెళ్ళికోసం పరాయి మగాడిని కొంగుపట్టి యాచించే దౌర్భాగ్యం ఏ కన్నెపిల్లకూ వద్దు ప్రభూ, వద్దు! వనిత లాగా పొందిఎ వస్తే చులకన కావటం మామూలేగా ... అన్నట్టు ఆ సామెత అందమైన వనితలకు చెందుతుందేమో! ... మరైతే తనలాంటి అనాకారి వనితల గతి? ... మరీ దారుణమేమో? ... మరింత చులకనేమో! ! ... అయినా ... అయినా ... తను చులకన కావటం ఇది మొదటిసారి కాదుగా? ... ఇదే మొదటి అనుభవం కాదుగా? ... అలాంటప్పుడు ఇంక జంకెందుకు? ఇంక సంశయ మెందుకు?'

జానకి ఆపైన ఆలోచించ దలుచుకోలేదు. ఒక నిర్ణయానికి వచ్చేసింది. ఏ సందేహాల్ని, సంశయాల్ని ఆమె లక్ష్య పెట్ట దలుచుకోలేదు. అనుమానాలూ, ఆలోచనలూ దాపుకి చేరనివ్వ దలుచుకోలేదు.

"ఓసేవ్, జానకీ ... దౌర్భాగ్యపు ముండా! ... తిండికి తగలడతావా?" తల్లి ఒక్క అరుపు అరిచింది వంటింట్లోంచి.

'ఎంత ముద్దుగా పిలుస్తోంది అమ్మ!' వెర్రిగా నవ్వుకుంటూ లేచింది జానకి.

• • •

రామారావు బాంక్‌కు బయల్దేరాడు. వెళుతూ వెళుతూ వీధి మొగన ఉన్న కిళ్ళీ షాపు దగ్గర ఆగాడు, సిగరెట్టు కాల్చుకుందుకు.

అంతక్రితమే ఆ షాపు దగ్గరున్న ఇంకోవ్యక్తి రామారావుని చూసి నవ్వాడు.

తర్వాత దగ్గరకొచ్చి — "ఏం బ్రదర్, మీ రా ఇంట్లోకి కొత్తగా వచ్చారా?" అనడిగాడు.

ఏ ఇంట్లో కన్నట్టు చూశాడు రామారావు.

"అదేనండీ బాబూ! ... రామనాథం గారింట్లోకి" అన్నాడు పెళ్ళున నవ్వుతూ.

"అవునండి!" అన్నాడు రామారావు.

"మేడమీద గదేనా?"


"అవును!"

"బ్రహ్మచారా మీరు?"

"ఊఁ! ..."

అంతే, ఆ వ్యక్తి వెంటనే పెద్ద పెట్టున వెకిలిగా నవ్వుతూ — "కొంప ముంచారండీ, బాబూ! ... కొంప ముంచారు! ... దెన్ గాడ్ ఓన్లీ సేవ్ యూ! ... కొంచెం జాగ్రత్తగా ఉండండి, బ్రదర్! ఎందుకైనా మంచిది" అంటూ సైకిలెక్కాడు. రామారావు కత వంటున్నది ఏమిటో అర్థం కావటంలేదు. ఆశ్చర్యంగా చూశాడు అతని వైపు.

"ఏమిటి మీ రనేది?" అడిగాడతన్ని. అతను సైకిలుమీద రివ్వుమని దూసుకుపోతూ — "తినబోతూ రుచెందుకు, సార్, అడుగుతారు. మీరే చూస్తారుగా?



ప్రకృతి సౌందర్యం — ఫొటో—కె. మధు (తెనాలి)

వెయిట్ చేయండి'' అంటూ వెళ్ళిపోయాడు.

'ఏమిటో అది? ... జాగ్రత్త అంటున్నాడు ... బ్రహ్మచారా? అంటున్నాడు ... ఏమిటి సంగతి ...' రామారావులో కోటి సందేహాలు, శతకోటి అనుమానాలు. అయితే, అవెక్కువసేపు నిలవలేదు. ఇట్టే కరిగి నీరైపోయాయి. దాని క్కారణం ఆత నా విషయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకపోవటమే, ఎక్కువ పట్టించుకోకపోవటమే.

రామారావు బాంక్‌కి వెళ్ళిపోయాడు.

* * *

''మనిషంటే అతనూ మనిషి! ... ఎంత మంచివాడనీ! ... ఆ వినయం, విధేయతా! ... చక్కటి కుర్రాడు. మనిషికూడా దివిటీలా ఎంత చక్కగా ఉంటాడో చూశావా? ...'' తండ్రి తెగ పొగిడేస్తుంటే, రామారావుని గురించి గుమ్మం వార నిలబడి వింటూంది జానకి.

''అవునండీ! ... ఎంత దర్జాగా ఉంటాడు కుర్రాడు! బాంక్‌లో ఉద్యోగం! జీతం అదీ బాగానే ఉంటుందేమో కదూ?'' జానకి తల్లి.

ఆ మాటకు పెద్దగా నవ్వాడు ఆయన. ''ఏం, పిల్ల నిద్దా మను కుంటున్నావా?' హేళనగా అడిగా డాయన.

జానకి చూడలేదు కాని, తల్లి మొహం చిన్నపోయి ఉంటుం దా మాటలకు.

''చాల్లెండి మీ వేళాకోళాలు! ... పుట్టెడు బెంగతో నే నేడుస్తుంటే మధ్యన మీ ఎత్తిపొడుపు మాట లొకటా! ఆ దౌర్భాగ్యపు దానికి అంత రాతే ఉంటే నల్లగా ఎందుకు ఉంటుంది? రూప్యా, రేఖా లేకుండా ఎందుకు పుడుతుంది?... అంతా ఖర్మ! ... ఖర్మ !!'' నుదురు బాదుకుం దావిడ.

జానకి కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

''ఊరుకోవే ... ఊరుకో !! ... ఏదో మాటవరస కంటే ... నాకు మాత్రం బెంగలేదూ? ... గుండెల మీద కుంపటై అది కూర్చుంది. ఊరూ వాడా పిల్లలకు పెళ్ళి చేయరా అని అడిగి హేళన చేసేలా చేస్తోంది ముదనష్టపు రాక్షసి ... అసలే కొడుకులు లేరనే బెంగ ... తల కింత కొరివి పెట్టేవాళ్ళు లేరనే బెంగ ...'' ఆయన మాట్లాడలేక పోయాడు.

జానకి ఇంక నిలవలేకపోయింది. పక్క మీద పడుకుని మనసులోనే బావురు మంది, పైకి ఏడిస్తే మరింత తిట్టి పోస్తారని.

'రామారావు తన నుద్ధరిస్తే బాగుం డును. తన కీ ఒక్క ఉపకారం చేస్తే బాగుండును.... మంచివాడట! ... మన సున్న మనిషట! ... అయితే, తన నీ చెరనుంచి విముక్తురాల్ని చేసే ఉపకార బుద్ధిమాత్రం ఎందుకు ఉండకూడదూ? ఉండచ్చు ... బహుశా ఉన్నా ఉండచ్చు!'

జానకిలో ఆలోచనలు సంకెళ్ళు విప్పు కుంటున్నాయి.

ఆశకు నీరు పోస్తున్నాయి.

'రామారావు తన గోడు వింటే ... తన బాధ అర్థం చేసుకోగలిగితే! ... రామారావు మంచివాడట ... మనసున్న వాడట ...'

జానకిలో కోర్కె బలపడుతూంది. అందుకోసం రామారావుని తన కనుకూ లంగా చిత్రీకరించుకుంటూంది.

'సమయం రావాలి ... ఆ ఘడియ రావాలి...!'

కన్నె మనసు ఆత్రత.

* * *

సమయం వచ్చింది. జానకికి అవకాశం వచ్చింది.

తండ్రి సాయంకాలానికి తిరిగి వచ్చేస్తానంటూ ఓ ఆదివారం నాడు పొరుగూరు వెళ్ళాడు. తల్లి జానకిని శతవిధాలా హెచ్చరించి పెత్తనాలకు వెళ్ళింది.

జానకి మనసులో చిన్న బెదురు.

ఆ బెదురును కాదంటుంది ఆమెలోని ఆశ!

'తెగించాలి ... లేకపోతే తనకి ఈ జన్మలో ముక్తి, మోక్షం రావు. అయినా, ఇంతకు ముందు ఎన్నిసార్లు ధైర్యం చేయలేదూ? ఎన్నిసార్లు తెగించలేదూ? మొదటిసారి జనార్దనాన్ని కాబోలు అడుగలే!...తరవాత ... విశ్వనాథాన్ని... ఏ ఆడదీ అడగని భిక్షం ... ''నన్ను పెళ్ళిచేసుకోరూ?'' అనడిగితే, పగలబడి నవ్వాడు. తనకన్నా చింతపండు ముద్దని కట్టుకోవటం నయం అన్నాడు. దాని కో రుచయినా ఏడిసిందట...ఆ వేళ ఎంతగా ఏడ్చింది? ... విశ్వనాథం ఫర్వా లేదు. ఆ తరవాత వచ్చిన పురుషోత్తం... ఛీ! ఛీ! ... పేరు విలువ కూడా తీసే శాడు. తనని పెళ్ళిచేసుకుని ఉద్ధరించ లేట్టు కాని, మరోలా అయితే అభ్యం తరం ఉండదన్నాడు. నీచుడు ... నోరు తెరిచి, సిగ్గు విడిచి అడిగితే ఎంత మా టన్నాడో! ... అలా అయితే తన మెడకు దక్కేది పసుపుతాడు కాదు. ఉరితాడు! అదికూడా తన చేతులతో తనే తగిలించు కోవాలి. అందుక్కూడా చేతులు రావు ఆ మగధీరుడికి. ఆనందరావూ, బుచ్చి బాబూ ... ఆ తరవాత అందరూ ఒకటే! ఒకలా సమాధానం చెప్పినవాళ్ళే! ... ఈ పాటి కో పదిమంది అయి ఉంటారు. కాదంటే కాదన్నారు. గది ఖాళీచేస్తున్న కారణం ఎవరూ కూడా తండ్రితో అనలేదు. అదో ఉపకారం చేశారు మహాను భావులు. లేకపోతే తన పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయ్యేది.'

జానకి తను చేయేబోయే సాహసం కోసం గతాన్ని ఒక మాటు గుర్తుకు తెచ్చుకుంటూంది. అయినా, రామారావుని అడగాలన్న కోరిక చావటం లేదు... అది అంతకంతకు పెరిగిపోతూంది. బ్రహ్మ రాక్షసిలా తయారవుతూంది.

జానకి బరువుగా నిట్టూర్చింది. మేడమెట్లు ఎక్కుతూంటే హృదయం దడదడ లాడింది జానకికి. మనసులో ఏ మూలో చిన్న బెదురు.

'ఇంతకూ ఈ శ్రీరామచంద్రు డేమంటాడో? ... అవునంటాడా? ... కాదంటాడా? ? ... కాయ లవుతుందా? పండు అవుతుందా? ... పండయితే? ... ఓహ్!! ఎంత బాగుంటుంది! . . . అమ్మకూ, నాన్నకూ ఒక్క మాటుగా తను బంగారు తల్లైపోదూ? తన నలుపూ, తనో అందవికారం అన్నీ ఒక్క మాటుగా పటాపంచలైపోవూ? ... తన దౌర్భాగ్యం, తన ముదనష్టపుతనం, తన దేభ్యపుతనం—అన్నీ సమూలంగా నాశనం అయిపోవూ ...?'

ఆలోచనంతోనే అన్ని మెట్లు ఎక్కే సింది జానకి. అందమైన ఊహలతో రామారావు గది గుమ్మం దగ్గరకు వచ్చే సింది. రెండు క్షణాలు ... సంశయిస్తూ



అలాగే నిలబడి ధైర్యాన్నంతా కూడదీసుకుని తెగించి తలుపు తట్టింది.

''ఎవరదీ?'' అన్న ప్రశ్న, తరవాత తలుపు తీసిన శబ్దం జానకికి ఉలికిపాటు కలిగించాయి.

తలుపులు బార్లా తీశాడు రామారావు. జానకి తెల్లబోయింది.

నల్లటి నలుపు కాకపోయినా నలుపూ, తుట్ట పెదవులూ...అందవికారంగా లేకపోయినా, ఆకర్షణలేని రూపం! రామారావుని తదేకంగా ఆలాగే నిలబడి చూడసాగింది జానకి! జానకి అందమైన ఊహాల్ని నాశనం చేస్తూ ఎదురుగా నిలబడి ఉన్నాడు రామారావు. పూర్తిగా నిరుత్సాహపడిపోయిందామె. తన హృదయంలో చిత్రించుకున్న అతని రూపానికీ, అసలు రూపానికి పోలిక లేకపోవడంతో జానకిలో తొట్రుపాటు కలిగించింది.

'ఇతగాడా దివిటీలాంటి మనిషి!' తండ్రి మాటలు జ్ఞాపకం వచ్చి లోపలే అనుకుంది జానకి ఆశ్చర్యంగా.

'హుఁ... మగవాడు — అతనెలా ఉంటేనేం? ... అయినా, అతని బ్యాంక్ ఉద్యోగం — అందులో అతనికొచ్చే అయిదు వందల రూపాయల జీతం అతన్ని దివిటీలా కనబడేలా చేస్తాయి. అతని మగతనం అతన్ని దివిటీగా కనపడేలా చేస్తుంది. అందులో ఒక ఆడపిల్లగల తండ్రికి మరీనూ — అతను నిండు వెలుగులా స్ఫురిస్తాడు. ఏ విషయంలో ఎలా ఉన్నా, మగపుటక ఈ విషయంలో అదృష్టమైనది!!'

జానకి ఆలోచనల నుంచి తేరుకుంది.

రామారావు ఏమిటన్నట్లు చూశాడు.

"లోపలకు రావచ్చా?" మెల్లిగా అడిగింది జానకి.

అతను మౌనంగానే అడ్డు తొలగి దారిచ్చాడు.

జానకి రామారావు గదిలోకి అడుగు పెట్టింది. అంతా కలయ చూసింది. నీటుగా ఉంది. 'మనిషి పరిసర ప్రాంతాలు ఆ మనిషి మనసును తెలియచేస్తాయి. ఒకవేళ రామారావు మనిషిలా ఉన్నా, మనసున్న వాడేనేమో? ... అతని మనస్సు వెన్నలాంటిదే నేమో?' జానకి ఆశలు రహదారి వెదుకుతున్నాయి.

రామారావు ఆశ్చర్యంగా జానకికేసి చూస్తున్నాడు. 'ఎందుకొచ్చిం దీమె? అందులోనూ ఇంట్లో ఎవరూ లేనప్పుడు?' రామారావుకి కిళ్ళీకొట్టు దగ్గర తనని హెచ్చరించిన వ్యక్తి గుర్తుకొచ్చాడు. 'అత నీ అమ్మాయి గురించేనా హెచ్చరిస్తు.'

"మిమ్మల్నొకటి అడగాలని వచ్చాను." జానకి మాటలు అతని ఆలోచనలకు అంతరాయం కలిగించాయి.


ఈ మాటు మరీ తెల్లబోయాడు.

"ఏమిటి?" తేరుకుని అడిగాడు.

అలా అడిగాడన్న మాటేకాని, ఆమె అడిగే దేమిటా అని సంశయంలో పడింది మనసు.

జానకి క్షణంసేపు చెప్పే విషయాన్ని మనసులో మననం చేసుకుంది. తరవాత—

"నే నడిగే విషయం విని ... ఆశ్చర్యపోవటం, అసహ్యించుకోవటం గాంటివి చేయకండి దయచేసి. ఈ అమ్మాయి ఇంత సిగ్గులేని దేమిటని కూడా అనుకోవద్దు. సిగ్గుపడవలసిన పనేం చేయబోవటం లేదు నేను. పెళ్ళి కావా లనుకుంటున్నాను. నా మెడ కొక పసుపుతాడు కావాలనుకొంటున్నాను... ఈ కన్నెచెర నుంచి విడుదల కోరుకుంటున్నాను. ఇది సిగ్గుపడవలసిన విషయమా? చెప్పండి ... నిజానికి పెళ్ళి కాకపోవటమే సిగ్గైన విషయం. ఆ స్థితిలో ఉన్నాను నేను. నల్లపిల్లనీ, మసిబొగ్గని, రాకాసినీ— ఎన్ని పేర్లు పిలవుతాయో అన్ని పేర్లు పెట్టింది లోకం నాకు. ఆ పేర్లతో నాకు పెళ్ళికాకుండా చేసింది. పెళ్ళికాని పిల్ల కన్నవాళ్ళకి సైతం శత్రువై పోతుంది, బయటి ప్రపంచంతో నాకు సంబంధాలెప్పుడో తెగిపోయాయి. కన్నవాళ్ళతో కూడా నాకున్న సంబంధా లంతమాత్రమే. అందుకనే ... నల్లపిల్లకు సంబంధాలు చూడాలనే దృష్టి లేదు వాళ్ళ కిప్పుడు. అందుకనే ... అందుకనే నా సంబంధం నేను వెదుకుక్కుంటున్నాను... నే నొకటి అడగదలుచుకున్నాను మిమ్మల్ని? . . .



ముమ్మూర్తులు చిత్రం—ఎ. ప్రభాకర్ (జగిత్యాల)

అడగమంటారా?" అని తల వంచుకుని అంది జానకి.

రామారావుకి ఒక వైపు భయం, మరొక వైపు అసహ్యం, ఇంకొకవైపు జాలి కలగసాగాయి ఆమెని చూస్తుంటే.

'ఒక ఆడపిల్ల... ఇలా ?? !!' అతనికి ఆశ్చర్యం ముంచుకొస్తూంది. జానకే అంది, అతను సమాధానం చెప్పకపోతే.

"మీరు నా మీద దయ చూపించక తప్పదు. మీరు ప్రయత్నిస్తే జాలి చూపించగలరు. చెప్పండి! నాకు పెళ్ళి కావాలి! ... నా కీ దుర్భర నరకం నుంచి విముక్తి కావాలి ... అదీ ఒక పసుపు తాడుతో! ... కాని, ఒకటి ... నాకు మీ ఇంటికి రాణి నవుదామనీ, మీ హృదయానికి పట్టపు రాణి నవుదామనీ ఆశ లేదు. అంత అత్యాశ నా కసలులేదు. ఒక దాసిగా మీ జీవితంలో నాకు చోటిస్తే చాలు ... ఒక పసుపుతాడుతో! ఆ భాగ్యం చాలు నాకు ... మీరు ... మీరు నన్ను పెళ్ళి చేసుకోరూ?"

జానకి చెంపలు కన్నీటితో తడిసి పోయాయి.

రామారావు షాక్ తిన్నట్లు అయాడు. 'వాట్ ఎ పిటేబుల్ కండిషన్!' అతనికి అంతకు ముందున్న అసహ్యం, భయం పోయాయి. జాలి పెరిగిపోయింది. అతని హృదయం ద్రవించిపోసాగింది.

జానకి కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

"నేను రోజూ దేవుణ్ణి ప్రార్థిస్తాను. ఏమనో తెలుసా? నీ మెడలో పూల గానూ, నీ పాదాల మీద పువ్వుగానూ అవాలని నే నాశపడటం లేదు. నిన్ను అభిషేకించేటప్పుడు ఉదకాన్ని చల్లటానికి ఉపయోగిస్తారే — ఆ పువ్వుపాటి అదృష్టం ప్రసాదించమని అడుగుతానండీ. ఆ! ... ఆ పాటి భాగ్యం ఎక్కువే నాకు!"

రామారావుకు హృదయం పిండేసినట్లయింది.

'తనకి దాంపత్య సుఖం కూడా అక్కర్లేదనీ ... తన వసలు తాక నవసరం లేదనీ ఎంత బాగా చెబుతూంది! ఎంత తెలివిగా చెపుతూంది! ... వెర్రిపిల్ల!! పెళ్ళికోసం ఎంత తపన పడుతూంది? ఎంత భయంకరమైన జీవితం గడుపుతూంది. . . కాని, తను ఆమె కోర్కె తీర్చలేడే...'

"చెప్పండి! ... నన్ను పెళ్ళి చేసు కోరూ?" జానకి దీనంగా అడుగుతూంది.

రామారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. జానకి వింతగా చూసింది.

రామారావు అన్నాడు: "మీ స్థితి నిజంగా నా హృదయాన్ని కోసేస్తూంది! కాని, నేను మీ కోర్కెను తీర్చలేను ... నేను నిస్సహాయుణ్ణి ... నన్ను తిట్టుకోకండి! ... నన్ను శపించకండి ... చెల్లెలి పెళ్ళీ, తమ్ముడి చదువూ, నా ఉద్యోగం నా పెళ్ళితో ముడిపడి ఉన్నాయి. నే నిది వరకే అమ్ముడు పోయిన మనిషిని ..."

జానకికి ఏడుపు గొంతు దాటి వస్తూంది! 'అయిపోయింది ... తన ఆశల పేకమేడ కూలిపోయింది. రామారావు కూడా కాదనేశాడు ... ఏ కారణం చేత నైతేనేం ... అతను కూడా తిరస్కరించేశాడు ... కన్నెచెర మరికొంతకాలం పొడిగించబడింది. తన కింకా బంధ విముక్తి కలిగే ఘడియ రాలేదు. అసలు వస్తుందో, రాదో!'

జానకి రామారావు గదిలోంచి బయట పడింది.

మెల్లగా, అతి నీరసంగా మెట్లు దిగ నారంభించింది. తన చూపులకు కన్నీటి పొర అడ్డొస్తూంటే ... వెళ్తూన్న ఆమెని చూస్తూ అలా నిలబడి పోయాడు రామారావు.

* * *

"మా ఆఫీసుకు దగ్గర్లో నా కింకో రూమ్ దొరికిందండీ ... నే నీ వేళే వెళ్ళిపోతున్నాను." రామారావు తండ్రితో చెపుతూంటే గదిలోంచి వింది జానకి. ఈ ముగింపు ఆమె కెప్పుడో తెలుసు. అందుకే అంతగా ఆశ్చర్యపోలేదు ఆమె.

"ఏం బాబూ? మా రూము నీకు సౌకర్యంగా లేదా?" వచ్చిన వాళ్ళంతా వచ్చినట్లే వెళ్ళిపోవటం ఆయనకు ఆశ్చర్యం కలిగించి ఉండవచ్చు. కాక పోతే ఓ మంచి కుర్రాడు వెళ్ళిపోతున్నాడనే బాధేనా కావచ్చు.

"అబ్బే! ... అదేం లేదండి ... చాలా సౌకర్యంగా ఉంది. కాని, మా స్నేహితు డొకడు నాతోకూడా ఉంటానంటున్నాడు. ఇద్దరికి ఈ రూము చిన్నదవుతుంది ... అందుకు ..."

జానకి అనుకుంది : 'అతనికి రూము సౌకర్యంగానే ఉంది. వచ్చిందల్లా తనతోనే అసౌకర్యం...'.

తండ్రి ఇంక సంభాషణ పొడిగించ లేదు.

"నీ ఇష్టం, బాబూ!" అని ఊరుకున్నాడు. రామారావు ఆ రోజే ఆ గది ఖాళీచేసి వెళ్ళిపోయాడు, బాధపడుతూనే.

జానకి చీకటి గదిలో కూర్చుంది.

ఆమెకు రామారావు మీద కోపం రాలేదు. కాని, వచ్చిందల్లా మొదటిసారిగా తన దౌర్భాగ్యం మీదా, తన ముదనష్టపు తనం మీదా. 'ఎంతటి వక్రజాతకురాలు తను! దేహీ! ... అని కొంగుపట్టి యాచించినా, తన బ్రతుకు ఎందుకూ కొరగాకుండా పోతూంది. . . ఎంతటి దౌర్భాగ్యం తనది!'

జానకి మంచంకోడు మీద తల వాల్చి కింద చతికిల బడింది.

కాసేపలా కూర్చున్నాక మెల్లగా సావిట్లోకి వచ్చింది.

తండ్రి బయటకు వెళ్ళినట్లున్నాడు. తల్లి వంటింట్లో ఉంది. జానకి వీధి తలుపు తీసి మేడమీదకు చూసింది. రామారావు గది ... రామారావు ఖాళీ చేసిన గది తాళంవేసి ఉంది.

దానికేసి చూస్తూ అనుకుంది:

'ఎవరినీ స్వంతంగా ఉంచుకో మనటం లే దీ హృదయాన్ని ... తను కన్నెకాదూ... ఇల్లాలు అని చెప్పుకునే ఆధారంకోసం, అర్హతకోసం అద్దెకు ఉండమంటూంది. వద్దనీ, ఉండమనీ నిర్దయగా తోసిపుచ్చి వెళ్ళిపోతున్నా రందరూ ... చివరకు రామారావుకూడా... ఈ గదిని చూసుకుందుకు మళ్ళీ ఎవరొస్తారో... ఈ మాటు ఎవరొస్తారో...' తన మనసు మీద తనకి అధికారం లేదని తెలుసు జానక్కి. దాన్ని తిట్టినా, చీవాట్లు పెట్టినా దాని తీరులో అది ఆలోచించటం మానదు. అందుకే జానకి ఊరుకుంది.

కన్నెమనసు ఆత్రత అలాంటిది. దాని నిరీక్షణ కొనసాగవలసిందే. జానకి ఇంట్లో దాచిన 'టు లెట్' బోర్డు తీసుకొచ్చి చీర కొంగుతో తుడిచి వీధి గోడకు తగిలించి లోపలకు వెళ్ళి పోయింది. ★